మట్ట మధ్యాహ్నాం ఎండన వచ్చారు. పత్రికల వాళ్ళమన్నారు. ఏ పత్రికో అడగలేదు. మర్యాద కాదు. కూచోమన్నాడు కామేశం. వాళ్ళు ముగ్గురు కూచున్నాక కూల్‌డ్రింక్స్, అతిథి మర్యాదలు ఆటోమేటిక్‌గా జరిగిపోతాయి. రచయిత కామేశం ఇంతలో "ఇప్పుడు చెప్పండి" తీరుబాటుగా కూచుని అడిగాడు.

"మే మో వార పత్రిక ప్రారంభిస్తున్నాం సార్".

"ఓ.కే. బావుంది. నా వల్ల ఏం సహాయం కోరుకుంటున్నారు?" ఇంగ్లీషులో అడిగాడు తెలుగు కామేశం. పత్రిక పేరేవిఁటి? వారపత్రికంటే మాటలు కాదు. మూటలు కావాలి. న్యూస్ ప్రింట్ కోటా సంపాయించుకోవాలి. కథలూ, సీరియల్స్ కావాలి. సినిమా వార్తలూ కావాలి. పది జోక్స్, పది వుత్తరాలు. చిటికలో ముగిసే చిన్న కథలూ వగైరా వగైరా కావాలి. ప్రతీ తెలుగు వారపత్రికా ఇదే చట్రంలో తిరుగుతుంది. అందుకని వివరాలు అడగలేదు ప్రొఫెషనల్ రైటర్‌గా ఈ మధ్యే బోర్డు మార్చేసిన కామేశం.

"తమ సీరియల్ నవలొకటి..." నసుగుతున్నాడు ముగ్గుర్లో వొకడు.

బహుశః ఈయనే పత్రిక సంపాదకుడై వుండొచ్చు. రచయిత ముందు చేతులు నలుపుకుంటూ సంపాదకుడనే వాడు మాటాడాడా అతను చాలా 'చిన్న'వాడని కామేశం భావం. ఆఫీసులో కూచుని అసిస్టెంట్స్ చేత కబురు పంపిచాడా అతను యమ అహంభావి అనేది కూడా కామేశం అభిప్రాయమే. ఇద్దర్నీ వొకేలా చూట్టం నేర్చుకున్నాడు.

"సీరియల్ నవలేగా...ఒకే. రాసేస్తా".


"అంతా ఒకేసారి యివ్వనవసరం లేదు సార్, వారం వారం ఇన్‌స్టాల్‌మెంట్స్ ప్రకారం పంపినా ఫర్వాలేదు."

"ఒకే, ఒకే."-

అలవాటైపోయాడు ఈ ఇన్‌స్టాల్‌మెంట్స్ రచనలకి. అన్ని పత్రికలకీ ఇన్‌స్టాల్‌మెంట్ సీరియల్. ఒక్కోసారి ఒక్కో మేటర్ ఈ పత్రికకు పంపబోయి మరో పత్రిక్కి పంపించేస్తాడు. అయినా ఫర్వాలేదు. పాఠకులు తిట్టరు. సీరియల్ నవల సమాజాన్ని పట్టి పీడించే సమస్య కాదు. అందువల్ల ప్రభుత్వం పట్టించుకోదు. రచయిత వినియోగదారుల చట్ట పరిధిలోకి రాడు. అందువల్ల ఏ వినియోగదారుడూ వీడి రచనల మీద రిపోర్టు చెయ్యడు. ఎక్స్‌పయిరీ డేట్ వుండదు నవల, కథల మీద. ఆ నవలల్ని ఏయే వస్తువుల్ని ఏయే నిష్పత్తిలో కలిపి తయారు చేశారో నవల మొదట్లో సూచించరు. ఏ సూత్రాలకీ ఏ కాంపొజిషన్‌కీ లొంగని ప్రక్రియ యిది. ఒక పత్రికలో ప్రచురింపబడుతున్న సీరియల్ మేటర్ మరో పత్రిక సీరియల్‌కి పొరపాటున పంపినా ఫర్వాలేదు. ఎందుకంటే అన్ని సీరియల్స్‌లో వున్న పాత్రల పేర్లూ వొకటే. ఏం? సినిమాల్లో ఒకే నటుడు రకరకాల పాత్రల వెయ్యాలి లేదా.

అదీ పాయింట్, అతను సక్సెస్ అయ్యాడు మరి. నో కామెంట్స్, నోరెత్తరెవరూ.

అతను మొదట్లో నవలంతా రాస్తే తప్ప పత్రికలకి యిచ్చేవాడు కాదు. కాని పత్రికల స్పీడ్ హెచ్చిపోయింది. రచయిత స్పీడ్‌ని అందుకోవాలి" "నేను ఏ వారంకి ఆ వారం యివ్వ"నన్నాడు. అంతే! వెనకబడిపోయాడు. పాత సరుకు? పాత భావాలు! ఛీ కొట్టారు. పత్రికలే ప్రోత్సాహం. జనం మాత్రం ఈ విధానాన్ని తిట్టారు. ఏడ్చారు. డబ్బు యిచ్చేది పత్రిక. దానికి తాను బాధ్యుడు. ఈ పాఠకులకి కాదు. విజృంభించాడు. ఇన్‌స్టాల్‌మెంట్ రచయితగా ఈ యుగపు మహా నవనవలా



రాజాధిరాజుగా చరిత్రపుటల్లోకి ఎక్కిపోయాడు.

"మాకు సెక్స్ నవల కావాలి సార్"

తీసుకో, ఓ.కే. ఓ.కే, మడిగట్టుకు కూచునేది ఆ రోజుల్లో. ఆ రచయిత లంతా చచ్చారు. ఆదర్శం ఆశయం ఇన్వాల్వ్‌మెంట్ అంతా నాన్సెన్స్. తను చెయ్యి చాస్తే, తను వస్తులుంటే ఈ విమర్శకశిఖామణులు ధర్మం చేస్తారా? సెక్స్ కథలే కాదు పరమ బూతు కథలూ రాశాడు. బోల్డు డబ్బు. వీటి వల్ల సమాజం నాశనమైపోదా? నాన్సెన్స్. థ్రో దట్ ఇడియాటిక్ ఆశయమ్స్. బుర్రలేని ఇడియట్స్‌కి ఆ ఆదర్శాలు. ఆశయాలు. సినిమా ఇంకా పెద్ద మిడియా. అందులో వాడే బూతుల్ని ఈ ఇడియట్సే మెచ్చుకుంటున్నారు. కోట్లు కోట్లు ఆ నిర్మాతకి లాభం. రాయనంటే- "పోరా, నీ బాబు మరోడు వస్తాడు" అక్కడ మాటలకి రెండు లక్షలు. కథకి ముడు లక్షలు. ఘోస్ట్‌రైటర్స్ చేత రాయించేస్తాడు వాడు. సాహిత్యం ఒక పరిశ్రమ అయిపోయింది. కథల కార్ఖాణాలు వెలిశాయి. స్కౌండ్రల్స్... చేతగాని దద్దమ్మలు... అరిచే కుక్క అరుపులు. లీవ్ దెమ్. రాసెయ్. లక్షలు... ఎవడిస్తాడీ రోజుల్లో? పది పైసలు లేకపోతే బస్ దించేసిన రోజులున్నాయ్. వందమంది బస్ ప్రయాణీకుల్లో ఒక్కడన్నా పది పైసలిచ్చాడా?" మహా రచయిత ఆయన. పాపం దింపకండి. నోనొనో' అని ఒక్కడైనా సానుభూతి చూపాడా? ఇలాంటి ధూర్తలోకంతో తనకేం పని?

"సెల్స్! ఓ.కే. ఎంత ఇస్తారు,"- పాయింట్ దగ్గరకొచ్చాడు.

"మామూలు కథకైతే వందసార్. సెక్స్ కథకైతే ఐదొందలు. మామూలు నవలకైతే మూడు వేలుసార్. మాంఛి సెక్స్ కథకైతే ముప్పయి వేలు సార్".

"ఒకే ఒకే. మాటాడకండి. సెక్స్ కధే ఖాయం. నా స్వంత పేర్తోనే రాస్తాను."

"అదే కావాలి సార్. మీ సొంత పేరు సెక్స్ నవలంటే ఆంధ్ర పాఠకులు పిచ్చెక్కిపోతారు. మారుపేరుతో మితిమీరిన సెక్స్‌రాస్తే పాఠకులు మీరని తెలీక తిడతారు. మీరు చెత్త రాసినా సువర్ణాక్షరాలే సార్".

ఒక సంపాదకుడు- అప్పట్లో "సార్ మాకో నవల కావా"లంటే, "మాంచి చారిత్రాత్మక నవల రాస్తున్నాను. తీసుకోండి" అన్నాడు కామేశం. "నో సార్, చారిత్రాత్మక నవలలు ఇప్పుడు చెల్లటం లేదు. జనం చదవరు" అన్నాడా సంపాదకుడు.

జనం తరఫున ఈ నకిలీ యోగ్యతాపత్రాన్నిచ్చే వీడి తెలివికి అక్కడితోనే ఫుల్‌స్టాప్. విద్యార్థులకి చరిత్ర చెప్పని విద్యాశాఖ సిలబస్ మీద దుమ్మెత్తిపోస్తూ సంపాదకీయాల్ని వీడే రాస్తాడు. చారిత్రాత్మక నవలలు చదవరట. వీడికి తెలసా? వీడెప్పుడన్నా పాఠకుల్ని కదిపాడా? కలిసాడా?

"తప్పదు సార్. వ్యాపారం" తన్నితాను సమర్థించుకునే కుహనా సంపాదకుడు.

అన్నిటినీ వ్యాపారంతోనే ముడిపెడతాడు. సినిమాల్లో అంతే." ఈ కథ జనానికి నచ్చదు సార్." మద్రాసులో డ్రింకుల మధ్య కూచుని కథల పొటెన్సీని నిర్ణయిస్తారు ఈ ఇంపోటెట్లు. రచయిత కేవలం ఫెయిర్ తీసే రాతగాడు. అక్కడ, ఇక్కడ, పత్రికల్లో, సెక్స్ కథలతో కేపటలిస్ట్ ఖజానిని నింపే మధ్యవర్తి అయిపోయాడు.

డబ్బు! డబ్బు! అన్ని విలువల్నీ సంబంధాల్నీ నిర్దేశిస్తోంది మరి.

"పత్రికను వినాయక చవతికి తీసుకొస్తున్నాం సార్"

మధ్య మళ్ళీ ఈ దేవుడెందుకు? ఉండాలి. ఈ కేపటలిస్ట్ ఎవడికీ జంకడు. ఒక కనిపించని 'దాన్ని' వాడే సృష్టించుకుని తానే దానికి భయపడతాడు. పూజిస్తాడు. అంతా నటన.

'మాంచి ఆర్టిస్ట్ చేత వినాయకుడి బొమ్మ వేయిస్తాం సార్. ప్రారంభ సంచిక కదా ముఖ చిత్రం దేవుడిదే వేస్తున్నాం"

"ఒకే ఒకే" ఎవడి బొమ్మ ముఖచిత్రంగా వేస్తే నాకేవిటయ్యా? అయినా వినాయకుడికి తెలుగొచ్చా ఏమైఁనానా? వొచ్చినా చదివే తీరికెక్కడిది? సంపాదకుడికే చదివే తీరికుండదు.

ఉత్తమ రచయిత ఎవడండే నా పత్రికలో 'పడిన' రచయితలే అంటార్ట సంపాదకులు. తన పత్రికలో పడిన రచయితకి తానే బిరుదులిచ్చేస్తాడు. డాస్టవస్కీని మించిన వాడంటాడు. ఎవడీ డాస్టవిస్కీ అంటే డస్ట్‌లో పడిన విస్కీ అంటాడేమో మరి. ఎన్ని రెడీమెడ్ బిరుదులో ఆ పత్రికలో కథలు రాయడం ఆపెయ్యగానే వీడి దృష్టిలో ఇడియట్. స్కౌండ్రల్‌గా మారిపోతాడు.

'సార్! మీకు అడ్వాన్స్...' నసుగుతున్నాడు సంపాదకుడు.

కావాలిగా. అడ్వాన్స్‌కాదు. మొత్తం డబ్బే ముందుగా కావాలి'

'అలాగేసార్. ఇదిగో చెక్కు"

చెక్కొద్దు' డబ్బుకావాలి'

'ఒకేసార్'

చెక్కుల డాబు ప్రొఫెసనల్ రైటర్ అయిన కామేశంకి తెలును.

'అయితే డబ్బు తర్వాత తెస్తాను'.

'తర్వాతే ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ నవల మేటర్ ఇస్తాను'

తలగోక్కున్నాడు సంపాదకుడు.

"ఒ.కే.సార్ అందాకా ఈ వెయ్యి ఉంచండి. తర్వాత వచ్చి మిగతా డబ్బిస్తా' వెయ్యి తీసుకున్నాడు ప్రొఫెషనల్ కామేశం.

చచ్చినాడికి వచ్చిందే దక్కుడు. ఈ మహా సంపాదకుడు తర్వాత రాకపోతే ఆ వెయ్యే దక్కుతుంది. పది రోజుల డ్రింక్ ఖర్చు. మిగతాది తీసుకుకొస్తే ప్లాట్ రిజస్టర్ చేయించుకోవచ్చు.

సంపాదకుడు నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

సాదరంగానే వీడ్కోలు ఇచ్చాడు. వెయ్యిచ్చాడని కాదు.

"హయ్యో తెలుగు సాహితీ మాతా! ఎంత ఖర్మొచ్చిందే నీకు?' అని కామేశం ఏడవలేదు. చాలా కాలం క్రితం ఏడ్చేవాడు. ఇపుడు మానేశాడు.

దేశంలో ప్రతీ భాషా రచయితలకూ ఒక సంఘం అంటూ ఉండి, ప్రతీ ఏటా వార్షికోత్సవాలు జరుపుకుంటూ ఉంటే తెలుగుసాహితి మాత్రం రకరకాల బ్రాంచీ సంఘాల ఏర్పాటుతో కొట్టుకులాడుతోంది. హెడ్డాఫీసు మాత్రం లేదు. ఒకడంటే మరొకడికి పడదు. ఒకడు మితవాది వాడిదో సంఘం. మరోడు అతివాది. వాడిదో సంఘం. మరోడిది తీవ్రవాసంఘం. మరొకడిది ఉగ్రవాద సంఘం. ఈ మధ్యలో అంతర్జాతీయ సంఘాలూ నకిలీ సరుకుల్లా పుట్టుకొచ్చేసి పాశ్చాత్య దేశాలకు ఉచిత ప్రయాణాలు చేసుకొచ్చేస్తున్నాయి. వాటినే మంత్రులూ పోషించడం. ఢిల్లీలో పద్మశ్రీలు.

హా! తెలుగు సాహితీ మాతా! ఎంతమంది నీ మీద పడి పీక్కుతింటున్నారమ్మా! అని బాధపడే బదులు తనూ వో రాబందులా మారిపోతే? మారిపోయాడు కామేశం.

అద్దె ఇల్లు లేదిప్పుడు. స్వంత ఫ్లాట్ జూబ్లీహిల్స్‌లో చవగ్గా కొట్టేశాడు. మోసానికి ఇంత పవరుందని కామేశానికి ఇంతవరకూ తెలీదు. దిగజారిపోతే ఇంతకింతగా పెరగొచ్చని తెలీదు.

ఇంత మోసమా? మనికి మోసం చేసి ఎంత ఎత్తుకి ఎదగగలడో అంత ఎత్తుకీ ఎదిగే లక్షణం ఈ నాటి రాజకీయ నాయకులకే స్వంతంగా అబ్బే విద్యకాదు. విలువల్నీ గౌరవాలనీ, మానవత్వాన్ని వొదిలేస్తే, కాకయి జంతో నోబెల్ బహుమతినైనా కొట్టేయొచ్చు. ఒకసారి ఆ అత్యున్నతస్థానానికి ఎదుగు... సీజర్ భార్య మహాపతివ్రత...

దినవార పత్రికలనిండా ఈ కొత్త వారపత్రిక ప్రకటనలే. పుంజెడు కథలు. కవితలు. ఫుల్‌పేజీ సెక్స్ బొమ్మలు ఫలానా రచయిత సెక్స్ సీరియల్. ఫలానా నవలా సమ్రాట్ దుమ్మందుమ్మం, సినిమావాళ్ల కలర్‌ఫుల్ పేజీ. సేంపిల్‌గా కథలో భాగం చదవండి. చదివించండి. యమప్రైజులు. చందాదారులకి లాటరీ. మొదటి బహుమతి అంబాసిడర్‌కారు. రెండోది కలర్ టి.వి. మూడోది ఉతుకుడు మెషిన్ తర్వాత ప్రైజులు కేర్‌ఫ్రీలు, దువ్వెన్లు.

అడిగే నాథుడు లేడు. దోపిడీ! దోపిడీ! సాహిత్యంలో ఈ పరుగులేమిటి? ఈ ఉరుకులేవిటి? ఈ ప్రైజులేవిటి? ఎవడడుగుతాడు? శాసనసభ ఈ మోసాల్ని గురించి చర్చించరు. అనవసరం వాళ్లకి.

రెండు నెలల తర్వాత సంపాదకుడు వచ్చాడు మళ్ళీ ముఖం పీక్కుపోయి ఉంది మిట్ట మధ్యాహ్నం ఆవాళ కూడా

"సార్ కొత్త వార పత్రిక పెడుతున్నా తమ కథవొకటి..." అర్థించాడు మళ్ళీ.

"ఇంతకు ముందు కూడా వచ్చారు కదండీ. ఆ పత్రిక ఏమయిందీ?' అర్థంగాక అడిగాడు ప్రొఫెషనల్ రచయిత కామేశం.

'రాలేదు సార్' ఆయనిచ్చిన పబ్లిసిటీకి వేల సంఖ్యలో ఏజంట్లు వచ్చారు. వాళ్లందరి దగ్గర నుంచీ డిపాజిట్లు వసూలు చేసి వారం రోజుల క్రితం ఏటోపారిపోయాడు.'

ఎంత కలక్షన్?'

'దాదాపు పాతిక లక్షలు'

'పాతిక లక్షలా?'' ఆశ్చర్యం ప్రొఫెషనల్ రచయితకు! తనూ ఇలాంటి వ్యాపారంలోకి దిగిపోతే? బాగానే ఉంటుంది. రెండు నెలల్లో పాతికలక్షలు. ఓ గాడ్!

నీ 'మొఖం - చిత్రం'లో చూశారా దేవుడు ఎంత మోసమో? ఇది సాహిత్యానికి క్షీణదశా? క్షీణదిశవేపు పోతున్నామా మనం?